
సాక్షి
కాకినాడ
ఆదివారం । 5 । మే । 2024



జగన్‌తో బడుగులకు మేలు
బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ ప్రభుత్వం పని చేస్తోందని బామ్‌సెఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అన్నారు. - 8లో ▸



డెల్టాలకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 3350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
41.0° / 28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	28.0
కాకినాడ	39.4	29.0
అమలాపురం	40.0	28.0

న్యూస్‌రీల్

ప్రణాళిక ప్రకారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



నన్నయ వర్సిటీ పీజీ సెంటర్‌లో ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ రూరల్: జిల్లాలో ప్రణాళిక ప్రకారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూలులో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కాకినాడ రూరల్ నియోజకవర్గ ఈవీఎం, వీవీ ప్యాట్స్ కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కోసం ఈ నెల 8వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా 18,715 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద తొలి రోజు పీఓలు, ఏపీఓలకు, రెండో రోజున ఓపీఓలకు, 6న ఓపీఓలు, పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, ఇతర శాఖల సిబ్బందికి కేటాయించామన్నారు. 7, 8 తేదీల్లో ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉండి, ఈ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగుల కోసం జిల్లా స్థాయిలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియ కూడా ప్రారంభమైందని, ఈ పద్ధతిలో జిల్లాలో 621 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని కలెక్టర్ నివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జి.శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి రూ.3.28 లక్షల ఆదాయం

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనం టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,28,855 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు మజ్జిగ కూడా అందించామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.



ముద్రగడను కలసిన వివిధ సామాజిక వర్గాల నాయకులు

పేదల ఆర్థికాభివృద్ధే జగన్ లక్ష్యం

కిర్లంపూడి: అన్ని సామాజికవర్గాల వారికీ సమన్యాయ పాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి బ్రాహ్మణ సంఘాలు, జగ్గంపేట నియోజకవర్గం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు వందలాదిగా శనివారం కిర్లంపూడి చేరుకుని, ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రతి ఒక్కరినీ ముద్రగడ పేరుపేరునా పలకరిస్తూ.. సీఎం జగన్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషి, కరోనా కష్టకాలంలో ప్రజలకు అందించిన వైద్య సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలు, కులమతాలకు తావు లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, సంక్షేమ పథకాలు సవ్యంగా అమలు కావాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు తోట నరసింహం, వంగా గీత, వరుపుల సుబ్బారావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిందాబాద్‌లు, జేజేల వల్ల పార్టీ విజయం సాధించదని, ప్రతి ఒక్కరూ విధిగా ఇంటింటికీ తిరిగి, వైఎస్సార్ సీపీకి ఓటు వేయాల్సిందిగా ప్రతి ఓటరునూ అభ్యర్థించాలని సూచించారు. పార్టీ విజయం అనంతరం తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముద్రగడ చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ముద్రగడ మార్గదర్శకత్వంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. వైఎస్సార్ సీపీ విజయమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తామని చెప్పారు.

ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు సంబంధించి స్థానిక జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లను శనివారం రాత్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, సర్వే, సమాచార పౌరసంబంధాలు, ఏపీ ఈపీ డీసీఎల్, ఆర్‌ఎంసీ, రోడ్లు భవనాలు, బీఎస్ఎన్ఎల్ ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ సెంటర్లు, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, సీసీ కెమెరాలు, టీవీలు, నెట్‌వర్క్ సదుపాయాలు, సిబ్బందికి భోజనం ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, రూట్‌మ్యాప్ సంబంధించి జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీ, మెకానికల్ ఇంజినీరింగ్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకు, కంప్యూటర్ సైన్సు పీజీ బ్లాక్, ప్రిన్సిపాల్ ఆఫీస్, ఇన్నోవేషన్ సెంటర్ తదితర బ్లాక్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, నగరపాలక సంస్థ ఏడీపీ సీహెచ్ నాగనరసింహారావు, రోడ్లు భవనాల ఎస్‌ఈ ఎం హరిప్రసాద్‌బాబు, సమాచారశాఖ అధికారి డి.నాగార్జున, ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ జి.ప్రసాద్, సర్వే ఏడీ బి.లక్ష్మీనారాయణ, బీఎస్ఎన్ఎల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్లకూ స్లిప్పులు

- జిల్లాలో ముమ్మరంగా పంపిణీ
- సమగ్ర సమాచారంతో అందజేత
- 8 వరకూ కొనసాగనున్న కార్యక్రమం

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల హడావుడి దాదాపు తుది అంకానికి చేరుకుంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ఒకవైపు పోటీలో ఉన్న అభ్యర్థులు క్షణం తీరిక లేకుండా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు పోలింగ్ నిర్వహణపై అధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు. పోలింగ్‌కు ఇక తొమ్మిది రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికే అధికార యంత్రాంగం ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించడం వంటి ముఖ్యమైన అన్ని పనులూ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసింది. కొత్త ఓటర్ల నమోదు అనంతరం తుది జాబితా కూడా విడుదల చేశారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు సమగ్ర సమాచారంతో ఓటర్ స్లిప్పుల (పోల్ చిట్టీ) పంపిణీ కార్యక్రమం చురుకుగా నిర్వహిస్తున్నారు. సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) ఇంటింటికీ వెళ్లి ఈ స్లిప్పులను ముమ్మరంగా పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ వరకూ ఓటర్ స్లిప్పుల పంపిణీ కొనసాగించనున్నారు. ఏ రోజు ఎన్ని పంపిణీ చేస్తున్నారో ఉన్నతాధికారులకు సాయంత్రం నివేదిక అందిస్తున్నారు.

ఓటర్ గైడ్..

ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు గైడ్ పుస్తకం అందిస్తున్నారు. నాలుగు పేజీల ఈ పుస్తకంలో కొత్త ఓటరుగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు ప్రక్రియ, ఎప్పుడు నమోదు చేసుకోవాలో వివరించారు. ఓటు వేసేందుకు ఎటువంటి గుర్తింపు కార్డు తీసుకురావాలి, ఏవి తీసుకుని వెళ్లకూడదో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వివిధ యాప్‌లు, పోస్టల్ బ్యాలెట్ సదుపాయం, ఓటు వేసే విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. తప్పకుండా ఓటు వేస్తానంటూ ఓటరు ప్రతిజ్ఞను కూడా ఓటరు గైడ్ పుస్తకంలో పొందుపరిచారు.

ఓటర్లకు చేరుతున్న స్లిప్పులు

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరగనుంది. ఆ రోజు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా ఓటర్లకు గుర్తింపుతో పాటు సులభతరంగా ఉండేలా స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని సహాయ రిటర్నింగ్ అధికారులు పోల్ చిట్టీలను పంపిణీ చేసే బీఎల్‌ఓలకు ముందుగా శిక్షణ ఇచ్చారు. వీటి పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. బీఎల్‌ఓలు గ్రామాల్లో నేరుగా ఇళ్లకు వెళ్లి ఓటర్లు లేదా వారి కుటుంబ సభ్యులకు వీటిని అందించాలి. ఇంటికి తాళం వేసి ఉంటే ప్రస్తుతం ఇచ్చిన గడువులోగా వారిని కలవాలి. అప్పటికీ రాని వారి వివరాలు, ఫొటో స్లిప్పులను తిరిగి ఎన్నికల అధికారులకే అప్పగించాల్సి ఉంటుంది. పంపిణీలో అర్హులైన వారికి స్లిప్పులు రాకపోతే ఆ వివరాలు ఇవ్వాలి. మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో పంపిణీ ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో స్లిప్పుల పంపిణీ జోరుగా సాగుతోంది. ఇప్పటికే గ్రామాల్లో 30 శాతం వరకూ పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని కాకినాడ లోక్‌సభతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లాలో మొత్తం 16,34,122 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 8,29,471 మంది పురుషులు 8,04,465 మంది, ఇతరులు 186 మంది ఉన్నారు. అత్యధికంగా కాకినాడ రూరల్‌లో 2,69,330 మంది, అత్యల్పంగా పెద్దాపురంలో 2,15,095 మంది చొప్పున ఓటర్లు ఉన్నారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కాకినాడ సిటీ 2,41,620 మంది ఓటర్లతో రెండో స్థానం, పిఠాపురం 2,36,409 మంది ఓటర్లతో మూడో స్థానం, జగ్గంపేట 2,29,863 మందితో నాలుగో స్థానం, తుని 2,24,538 మందితో ఐదో స్థానంలో ఉన్నాయి.



పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

పోల్ చిట్టీలో..

పోల్ చిట్టీలో అసెంబ్లీ నియోజకవర్గం, సంఖ్య, ఓటర్ పేరు, లింగం, ఓటర్ గుర్తింపు కార్డు సంఖ్య, తండ్రి పేరు, పోలింగ్ కేంద్రం ఉన్న ప్రదేశం, పోలింగ్ కేంద్రం సంఖ్య, పోలింగ్ కేంద్రం భవనం వివరాలు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్ 1950, క్యూఆర్ కోడ్, రూట్ మ్యాప్ తదితర వివరాలు ముద్రించారు. అలాగే, సంబంధిత బీఎల్‌ఓ పేరు, మొబైల్ నంబర్, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలు, పోలింగ్ రోజున పాటించాల్సిన నిబంధనలను ఈ చిట్టీలో పొందుపరిచారు.

ఎస్సీలకు భరోసా సీఎం జగన్

- వైఎస్సార్ సీపీని గెలిపించండి
- ఆత్మీయ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ వర్గాలకు అండాదండ, భరోసా అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేటలోని తన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం జరిగిన ఎస్సీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చంద్రబాబుది కృత్రిమ ప్రేమ అని, కుటుంబాన్ని విడదీయాలంటే ఆయన వద్దకు వెళ్లాలని, ఎవరైనా ఇద్దరిని కలపాలంటే సీఎం జగన్ వద్దకు వెళ్లాలని అన్నారు. అన్నదమ్ముల్లాంటి దళితులను చంద్రబాబు రెండుగా విడదీశారన్నారు. ఒకరినొకరు అనుమానించుకునే స్థితికి తీసుకువచ్చారని చెప్పారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని కూడా చంద్రబాబు విడదీశారన్నారు. ఏ నాయకుడైనా ప్రజల్లోకి వచ్చిన తరువాత అందరినీ సమానంగా చూడాలన్నారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అన్న చంద్రబాబుకు, తన ఇంట్లోనే దళితులున్నారనే జగన్‌మోహన్‌రెడ్డికి పోలిక ఎక్కడ అని ప్రశ్నించారు. ఒక నాయకుడు మనతో ఎలా ఉండాలో చెప్పడానికి జగన్ ఉదాహరణన్నారు. పేద కుటుంబాల విద్యార్థులు ఇంజినీర్లు, డాక్టర్లు అవడానికి, విదేశాలకు వెళ్లడానికి నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కారణమని, దీనిని సీఎం జగన్ ప్రోత్సహించారని గుర్తు చేశారు. తన కుటుంబ సభ్యులు ఒక కులం కోసం పని చేయలేదని, అన్ని కులాల వారూ ఆత్మబంధువుల్లా తమతో ఉన్నారని కన్నబాబు చెప్పారు. ఎన్నికల ముందే సంస్కారం లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్న జనసేన నాయకులకు ఓటు వేయవద్దని కోరారు. చంద్రబాబు అబద్ధాలనే నమ్ముతాడని, అవే మాట్లాడతాడని అన్నారు. ముద్రగడను నానా హింసలకు గురి చేశారని గుర్తు చేశారు. చంద్రబాబుకు ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమారరాజా పార్టీకి అండగా ఉన్నారని కన్నబాబు చెప్పారు. ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బందిలి వీరీష, పలువురు ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబు. చిత్రంలో కుమారరాజా

పురం.. ఎవరి పరమో..!

- మెట్ట ప్రాంత ముఖద్వారం పెద్దాపురం
- సగ్గు బియ్యం పరిశ్రమలకు నెలవు
- ఏడీబీ రోడ్డు వెంబడి ఇతర పరిశ్రమలు



సామర్లకోట-పెద్దాపురం కూడలిలోని ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం

సామర్లకోట: మెట్ట ప్రాంత ముఖద్వారంగా పెద్దాపురం నియోజకవర్గం ఉంది. దీంతో మెట్ట ప్రాంత నేతలే ఇక్కడ ఎక్కువ సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అనపర్తి, పిఠాపురం, జగ్గంపేట, కాకినాడ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్ల మధ్య 291.46 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గం మొదట్లో కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది.

ఇవీ ప్రత్యేకతలు

- నియోజకవర్గంలోని సామర్లకోట జిల్లాలో పెద్ద రైల్వే జంక్షన్. ఇక్కడి నుంచే కాకినాడ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. పెద్దాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం తదితర ప్రాంతాల వారు సామర్లకోట నుంచే రైళ్లలో రాకపోకలు సాగిస్తారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ఎదురెదురుగా ఉన్నాయి.
- సగ్గు బియ్యం పరిశ్రమలు సామర్లకోట మండలంలో ఉన్నాయి. ఇక్కడ తయారైన సగ్గుబియ్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ఏడీబీ రోడ్డులో రాక్, అపర్ణ సిరామిక్స్, రిలయన్స్, జీవీకే పవర్ ప్లాంట్లతో పాటు అనేక ఇతర పరిశ్రమలు ఉన్నాయి.

శిక్షణలకు కేంద్రం

రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు సామర్లకోట శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తుంటారు. గిరిజన యువతకు శిక్షణ ఇవ్వడానికి గిరిజన శిక్షణ సంస్థ ఇక్కడే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, సర్వే సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి విస్తరణ, శిక్షణ కేంద్రంలోనే రెవెన్యూ అకాడమీ ఉంది. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు ప్రతి నెలా సర్వసభ్య సమావేశం నిర్వహించే టీటీడీ సామర్లకోటలోనే ఉంది. ఈ శిక్షణ కేంద్రంలో గ్రామీణ యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రైవేటు న్యాక్ సంస్థలో గృహ నిర్మాణానికి సంబంధించిన శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తారు. వ్యవసాయ రంగంలో శిక్షణ ఇవ్వడానికి సామర్లకోటలోనే వ్యవసాయ క్షేత్రం ఉంది. ఇక్కడ వరి విత్తనాలు పండిస్తారు. సుమారు 30 ఏళ్ల క్రితం బాగా గిరాకీ ఉన్న ఎస్‌ఎల్‌ఓ అక్కుళ్లు రకం ధాన్యాన్ని ఇక్కడ పండించారు. పెద్దాపురం పాండవుల మెట్టపై నవోదయ విద్యాలయం ఉంది.

పుణ్యక్షేత్రాలకు నెలవు

ఎన్నో పుణ్యక్షేత్రాలకు ఈ నియోజకవర్గం నెలవు. పంచారామ క్షేత్రాల్లో ఒకటైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సామర్లకోటలో ఉంది. సామర్లకోట - పెద్దాపురం పట్టణాల కూడలిలో 65 అడుగుల ఎత్తయిన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం ఉంది. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ, చదలాడ తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయాలు ఈ నియోజకవర్గంలోనే కొలువుదీరాయి. పాండవులు అజ్ఞాతవాస సమయంలో పెద్దాపురం పాండవుల మెట్టపై నివసించినట్టు చెబుతారు. అనేక మంది యాత్రికులు పాండవుల మెట్టను తిలకిస్తారు. ఇక్కడి సూర్యనారాయణస్వామి ఆలయం కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది.

ఎక్కువసార్లు స్థానికేతరులకే పట్టం

తోట రామస్వామి	కిర్లంపూడి
పంతం పద్మనాభం	గెద్దనాపల్లి
బొడ్డు భాస్కర రామారావు	పెద్దాడ
తోట గోపాలకృష్ణ	కిర్లంపూడి
పంతం గాంధీమోహన్	గెద్దనాపల్లి
నిమ్మకాయల చినరాజప్ప	అమలాపురం
స్థానికులు..	
దుర్వాసుల వెంకటసుబ్బారావు	పెద్దాపురం
వుండవిల్లి నారాయణమూర్తి	సామర్లకోట
కొండపల్లి కృష్ణమూర్తి	వేట్లపాలెం
బలుసు రామారావు	సామర్లకోట

ఇదీ నియోజకవర్గ స్వరూపం

ఓటర్లు : 2,11,937

స్త్రీలు : 1,07,478 పురుషులు : 1,04,446

ఇతరులు : 13 పోలింగ్ కేంద్రాలు : 211

2019-23 మధ్య ప్రభుత్వ పథకాలతో లబ్ధి

పథకం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లు)
వైఎస్సార్ పెన్షన్ కానుక	1,36,577	602.42
జగనన్న అమ్మ ఒడి	10,388	129.86
వైఎస్సార్ చేయూత	9,219	45.81
వైఎస్సార్ ఆసరా	36,340	148.53
వైఎస్సార్ రైతు భరోసా	10,413	7.96
ఇళ్ల స్థలాలు	18,906	
వైఎస్సార్ కాపు నేస్తం	3,857	41.62
వైఎస్సార్ నేతన్న నేస్తం	108	5.67
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	212	1.77
వైఎస్సార్ బీమా	192	7.92
వైఎస్సార్ వాహన మిత్ర	1,106	9.96
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	6,200	15.01
సున్నా వడ్డీ పంట రుణాలు	3,800	4.06
జగనన్న విద్యా దీవెన	1,200	32.54
జగనన్న వసతి దీవెన	800	7.06
జగనన్న చేదోడు	438	2.84
జగనన్న గోరుముద్ద	12,543	17.02
జగనన్న విద్యా కానుక	7,200	10.17
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	1,896	42.38
జగనన్న తోడు	4,432	15.65
వైఎస్సార్ యంత్ర సేవా పథకం	96	4.50
ఉచిత పంటల బీమా	5,273	38.62
సీఎం సహాయ నిధి	1,200	7.88

రాజకీయ చరిత్ర

పెద్దాపురం నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ప్రారంభంలో ఇది కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది. 1983లో ఆవిర్భావం అనంతరం టీడీపీ ఎక్కువ పర్యాయాలు విజయం సాధించింది. స్థానికుల కంటే ఎక్కువ మంది స్థానికేతరులకే ఇక్కడి ఓటర్లు ఎమ్మెల్యేలుగా పట్టం కట్టడం విశేషం. మొట్టమొదట 1952లో ఎమ్మెల్యేగా తోట రామస్వామి (కాంగ్రెస్), 1955లో దుర్వాసుల వెంకట సుబ్బారావు (సీపీఐ), 1962లో పంతం పద్మనాభం (కాంగ్రెస్), 1967లో వుండవిల్లి నారాయణమూర్తి (సీపీఐ), 1972లో కొండపల్లి కృష్ణమూర్తి (కాంగ్రెస్), 1978లో వుండవిల్లి నారాయణమూర్తి (కాంగ్రెస్), 1983, 1985లో బలుసు రామారావు (టీడీపీ), 1989లో పంతం పద్మనాభం (కాంగ్రెస్), 1994, 1999లో బొడ్డు భాస్కర రామారావు (టీడీపీ), 2004లో తోట గోపాలకృష్ణ (కాంగ్రెస్), 2009లో పంతం గాంధీమోహన్ (ప్రజారాజ్యం), 2014, 2019లో నిమ్మకాయల చినరాజప్ప (టీడీపీ) ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

రెండు పర్యాయాలు ఎన్నికైంది వీరే..

వుండవిల్లి నారాయణమూర్తి, పంతం పద్మనాభం, బలుసు రామారావు, బొడ్డు భాస్కరరామారావు, నిమ్మకాయల చినరాజప్ప. ఇప్పటి వరకు మూడో పర్యాయం ఎన్నిక అయిన వారు నియోజకవర్గ చరిత్రలో లేరు. అయితే మూడో పర్యాయం టీడీపీ అభ్యర్థిగా నిమ్మకాయల చినరాజప్ప పోటీకి సిద్ధమవుతున్నారు. ఆయపై వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దవులూరి దొరబాబు పోటీ చేస్తున్నారు. వీరిలో పాగా వేసేదెవరో నెల రోజుల్లో తేలనుంది.

జగన్‌తో బడుగులకు మేలు

- ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు
- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నయనాల కృష్ణారావు

రాజమహేంద్రవరం సిటీ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, బామ్‌సెఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు సామాజిక ఉద్యమంలో పనిచేసి పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేశానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల సంక్షేమానికి చేస్తున్న కృషి అద్భుతమన్నారు. జగన్ ఆలోచనలు, ఆశయాలకు ఆకర్షితుడనై బామ్‌సెఫ్, మూల్ నివాసీ జాతీయ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసి, వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లు ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేలా ప్రోత్సహిస్తుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్, పార్లమెంట్ అభ్యర్థులు మార్గాని భరత్‌రామ్, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా విజయానికి కృషి చేస్తానన్నారు. అలాగే రాజోలు, పిఠాపురం పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం చేస్తానని కృష్ణారావు తెలిపారు. నాయకులు రేలంగి శేఖర్, జామి రాజ్‌కుమార్, రహీమ్, అలీషా, దంగేటి శివాజీ, మేఘేంద్ర, డి.కొండలరావు పాల్గొన్నారు.

గోదావరిలో జారిపడి యువకుడి మృతి



వింటి లోకేష్ (ఫైల్)

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి వద్ద గౌతమీ గోదావరి నదిలో ప్రమాదవశాత్తూ జారిపడి అదే గ్రామానికి చెందిన వింటి లోకేష్ (20) మృతి చెందాడు. అంగర ఎస్సై అందె పరదేశి కథనం ప్రకారం.. కోరుమిల్లి గ్రామ శివారు చినకోరుమిల్లికి చెందిన లోకేష్ నదిలోకి దిగగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. లోకేష్ తండ్రి రాంబాబు కూరగాయలు విక్రయిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కవల కుమారులు ఉండగా, ఇందులో లోకేష్ మృతిచెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్సై తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



సాధించిన రికార్డులతో రియాన్స్

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో యూకేజీ చదువుతున్న బి.రియాన్స్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించాడు. ఐదేళ్ల రియాన్స్ ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఎంపిక ప్రక్రియలో తొమ్మిది సెకండ్లలో దక్షిణ అమెరికా ఖండంలో 13 దేశాల జెండాలను గుర్తించి ఈ ఫీట్ సాధించాడని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తెలిపారు. అలాగే ప్రపంచ పటంలోని దేశాలను గుర్తించడంతో పాటు ప్రపంచ దేశ రాజధానులు, భారతదేశ రాష్ట్రాల రాజధానులను గుర్తించడంలో కూడా ప్రతిభ కనబరిచాడని వివరించారు. చిన్న వయసులో ఇలాంటి ఘనత సాధించడం అభినందనీయమని విద్యాసంస్థల అధినేత నరశింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు కొనియాడారు.

విద్యార్థిని ఆత్మహత్య



వనలక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నల్లజర్ల: పుల్లలపాడు గ్రామానికి చెందిన దాసరి దుర్గారావు, నిర్మలల కుమార్తె వనలక్ష్మి గత మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయ్యింది. శనివారం ఈ విషయమై ఆమె తల్లి మందలించింది. మనస్తాపానికి గురై తల్లిదండ్రులు ఇద్దరు పొలం పనికి వెళ్లిన సందర్భంలో వనలక్ష్మి (15) ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు నల్లజర్ల ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.